# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## ఆపదమొక్కులవాడికి
# వైభవంగా ఆణివార ఆస్థానం

**-హారతి రూపాయి వెంకన్న ఖజానాకు జమ**



తిరుమల, జులై 16ప్రభాతవార్త:
శ్రీవేంకటేశ్వరస్వామికి సాలకట్ల ఆణివార ఆస్థానం మంగళవారం ఉదయం వేడుకగా జరిగింది. ఆణివార ఆస్థానంలో జీయంగార్లు, ఆలయఅర్చకులు పరివట్టం (చిన్నపట్టుగుడ్డ)కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి "నిత్యైశ్వర్యోభవ:"అని ఆశీర్వాదించారు. ఆ తరువాత పెద్దజీయంగారికి, చిన్నజీయంగారికి ,టిటిడి తరపున ఇఒ జె.శ్యామలరావుకు "లచ్చన"తాళపు చెవిగుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలించారు. రూపాయి హారతి, చందనం .తాంబూలం,తీర్థం శఠారి మర్యాదలు చేసిన తరువాత తాళపుచెవి గుత్తిని మూలవిరాట్టు వేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది. పెద్దజీయర్‌స్వామి వెండితట్టలో ఆరు పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోనికి చేరుకున్నారు. నాలుగు పట్టువస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు, జఈఓ వీరబ్రహ్మాం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

### వేడుకగా పుష్పపల్లకీ



ఆణివార ఆస్థానం రోజు మంగళవారం సాయంత్రంశ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి విశేషాభరణాల అలంకృతుడై పుష్పపల్లకిని అధిరోహించారు. రకరకాల సువాసనల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై ఉభయదేవేరులతో స్వామివారు భక్తులను కటాక్షించారు.

## రేపు కుప్పంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

**- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్**



కుప్పం, జూలై 16 ప్రభాతవార్త
ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 18వతేది కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేసి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కాగా జూలై నెల 4వతేది సైతం కుప్పంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను చేపట్టిన విషయం విదితమే.

# ప్రభుత్వ భూమి హాంఫట్!

**తిరుపతిజిల్లాలో 270 కోట్ల రూపాయల భూమి స్వాహా!!**

**తిరుపతిరూరల్లో భూ దోపిడీని స్వయంగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి**

**-భూ కబ్జా రాయుళ్ళ భరతం పట్టనున్న ప్రభుత్వం**

తిరుపతిరూరల్, జూలై 16 ప్రభాతవార్త:
తిరుపతిజిల్లాలో రూ.270కోట్ల రుపాయాలు ఖరీదు చేసే విలువైన ప్రభుత్వ భూములను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లగొట్టారని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించడంపై తిరుపతిజిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చనడుస్తుంది. తిరుపతి, రేణిగుంట, తిరుచానూరు ప్రాంతాలలో 22ఎ కింద ఇష్టానుసారంగా ఖరీదు చేసే భూములను కాజేసారని తెలిపారు. తిరుపతిరూరల్ మండల పరిధిలోని తిరుచానూరులో 4.5 ఎకరాలు కాల్వపోరంబోకు స్థలం, తిరుపతి అర్బన్ పరిధిలో మంగళం లెక్కదాఖలలో 27.14 ప్రభుత్వ భూమిని. దామినేడులో కుంటపోరంబోకు 1.33 ఎకరాలు స్థలాన్ని, చిగురువాడు ఉత్తరపు కండ్రిగలో 1.33 ఎకరాలు కాల్వపోరంబోకు స్థలాన్ని, శూరప్పకాశంలో 12.69 ఎకరాల భూమిని ల్యాండ్ సీలింగ్ ద్వారా కాజేసారని తెలిపారు. తిరుపతిజిల్లాలో కోట్ల రుపాయాలు ఖరీదు చేసే భూములు అన్యాక్రాంతంపై రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించడంపై భూ కబ్జా రాయుళ్ళ గుండెల్లో గుబులు పట్టుకుంది. ప్రభుత్వభూములను కొల్లగొట్టి పేదలకు విక్రయించి సోమ్ము చేసుకున్న కబ్జా రాయుళ్ళు భరతం పట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్దమైన విషయం తెల్సిందే. అధికారం మనదే...అధికారులు మనం నియమించుకున్నవాళ్ళే...మనం ఏమి చేస్తే ఎవరు పట్టించుకుంటారు! అనే పంథాలో కొందరు వైకాపా నాయకులు వ్యవహరించారు. తిరుపతి, తిరుపతి పరిసర ప్రాంతాలలో కోట్ల రుపాయాల విలువ చేసే ఖరీదైన భూములను ఆక్రమించి, సామాన్య మధ్యతరగతి ప్రజలకు విక్రయించి కోట్ల రుపాయాలను ఆర్జించిన విషయం తెల్సిందే. ముఖ్యంగా తిరుపతిరూరల్ మండలంలో డికెటి,కాల్వ, కుంట, అనాధీనం, గడ్డపోరంబోకు, చెరువుపోరంబోకు, చెరువు తట్టు, వంకపోరంబోకు, కశంకాల్వ, స్వర్ణముఖి పరివాహక తదితర ప్రాంతాలతో పాటు స్మశాన వాటికలను వదలలేదు కబ్జారాయుళ్ళు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గుగూల్ సర్వే చేయించి, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించే పనిలో ఉన్నాతాధికారులు ఉన్నట్లు సమాచారం.




# వైభవంగా ద్రౌపదీదేవి కళ్యాణం

శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించబడుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ద్రౌపదమ్మ కళ్యాణం నిర్వహించారు. ఆలయ ఆవరణను ఓ కళ్యాణ వేదికగా ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు, అరటి చెట్లుతో చక్కగా తీర్చి దిద్దారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా మన సంప్రదాయాన్ని అద్దం పట్టే విధంగా ముస్తాబు చేశారు. వేదపండితులు వేద మంత్రాల్ని ఘోషిస్తుండగా సంప్రదాయ బద్దంగా కళ్యాణ తంతును ప్రారంభించారు. ఆలయ పూజారులు పురుషోత్తం, రఘు,కార్యక్రమాల్ని నిర్వహించారు. ద్రౌపదీ దేవిని వధువుగా ముస్తాబు చేశారు. అర్జునుని వరుడుగా ముస్తాబు చేసి కళ్యాణ మండపం వద్దకు వేదమంత్రాలతో మేళ తాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. ఇక్కడ హోమాలు, కళ్యాణ మంత్రాలు, సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీకాళహస్త్వీరాలయ ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఉత్సవాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు. కళ్యణోత్సం కమనీయంగా నిర్వహించారు.కళ్యాణానికి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి తెలుగుదేశం నాయకులు హాజరయ్యారు. వేదపండితుడు అర్థగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా ఉభయదారులు హాజరు కాగా కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తరువాత గ్రామోత్సవం జరిపారు.



## తిరుమల జెఈఓగా
# వెంకయ్యచౌదరి

**-రెండురోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు**



తిరుమల,జులై 16ప్రభాతవార్త
ధార్మికసంస్థ టిటిడిలో తిరుమల జెఈఓగా ఐఆర్‌ఎస్ 2005బ్యాచ్‌కు చెందిన వెంకయ్య చౌదరి చిరు మామిళ్ళ నియామకమయ్యారు. కేంద్ర సర్వీసుల నుండి ఆయన మంగళవారం డిప్యూటేషన్‌పై మూడేళ్ళు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఆయనను రాష్ట్రానికి పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఆయనను తిరుమల జెఈఓగా టిడిపి కూటమి ప్రభుత్వం నియమించనుంది. ఇప్పటికే ఈయన నియామకంపై సిఎం చంద్రబాబునాయుడు కేం ద్రానికి విన్నవించిన మేరకు వెంకయ్యచౌదరి రాష్ట్రానికి వస్తున్నారు. మూడురోజుల్లో ఆయన తిరుమల జెఈఓగా బాద్యతలు చేపట్ట నున్నారనేది సమాచారం.

# గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

**సుమారు రూ. 1,17,000 విలువైన 23.4 కేజీల గంజాయి స్వాధీనం**



గూడూరు, జులై 16, ప్రభాతవార్త
గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు ముద్దాయిలు అరెస్టు చేసి సుమారు రూ. 1,17,000 విలువ గల సుమారు 23.4 కేజీల గంజాయి, నోకియా, ఒపో సెల్ ఫోన్‌లు గూడూరు 1 టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి సుబ్బరాయులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఎస్పి సుబ్బరాయుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ గూడూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ ఆఫీసర్ సూర్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో, గూడూరు 1 టౌన్ సిఐ పాపారావు సిబ్బందితో కలిసి నిషేధిత పదార్థాలైన గంజాయి వంటివి అక్రమ రవాణా అరికట్టుటకు నిఘా ఉంచడం జరిగిందన్నారు. గూడూరు 1 టౌన్ సిఐకి రాబడిన సమాచారం మేరకు గూడూరు 1 టౌన్ ఎస్ఐ శ్రీహరిబాబు సిబ్బంది గూడూరులోని రైల్వే పార్శిల్ ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా కదలికలు ఉన్న ముగ్గురు ముద్దాయిలను అదుపులో తీసుకుని డిప్యూటీ తహశీల్దార్ సమక్షంలో విచారించారు. ముద్దాయిలు సెల్వం గోకుల్, శరవణన్ అభిషేక్, రాజ్ తమిళ సెల్వంను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు 23.4 కిలో గ్రాముల గంజాయి, నోకియా, ఒపో సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన శివ అనే ముద్దాయి పరారీలో ఉన్నాడని, అతనిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. గంజాయి సరఫరా, రవాణా చేయడం వెనుక, ముందు ఎవరెవరు వున్నారనేది గుర్తించి అట్టి వారిపైన కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి కలిగి వుండిన, రవాణా చేస్తున్న, అమ్ముతున్న వారి వివరాలను తిరుపతి జిల్లా పోలీస్ నెంబర్ 8099999977కు ఫోన్ ద్వారా గానీ వాట్సాప్ ద్వారా గానీ తెలియపరచవచ్చని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని జిల్లా ప్రజలకు ఎస్పి సుబ్బరాయుడు విజ్ఞప్తి చేసారు. నేరస్తులను అరెస్టు చేయడంలో సహకరించిన సుబ్బరాయుడు సిఐ రేణిగుంట రూరల్ పిఎస్, స్పెషల్ పార్టీ సిబ్బందిని అలాగే నేరస్థులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరిచిన సూర్యనారాయణ రెడ్డి ఎస్‌డిపిఒ గూడూరు, పాపా రావు ఇన్స్పెక్టర్ గూడూరు 1 టౌన్, ఎస్ఐ శ్రీహరి బాబు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏస్పీలు వెంకట్రావు పరిపాలన ,కులశేఖర్ శాంతిభద్రతలు, గూడూరు డిఎస్పి సూర్యనారాయణ, సిఐలు పాపారావు, సుబ్బరాయుడు, గూడూరు వన్ టౌన్ ఎస్ఐ శ్రీహరి బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విషజ్వరాలు ప్రబలకుండా
# అప్రమత్తంగా వ్యవహరించాలి

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి**



పెద్దపంజాణి జూలై 16 ప్రభాతవార్త :
ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన అకస్మి కంగా తనిఖీ చేసారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వాప్తంగా అక్కడక్కడ టైఫాయిడ్ ,డెంగ్యూ, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించా లని వైద్యులకు సూచించారు.అలాగే ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు గ్రామాల్లో పర్యటించి జ్వరాలతో బాధప డుతున్న వారివివరాలు సేకరించి వారికి సరైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి నందిని,ఎంపిహెచ్ఎస్ రాధాకృష్ణ,పంచాయతీ కార్యదర్శి గనపతి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఇనగలూరు సెజ్ హిల్ టాప్
# పరిశ్రమలకు చేయూత

**అధికారులతో కలెక్టర్ సమీక్ష**



శ్రీకాళహస్తి రూరల్,జూలై 16 ప్రభాతవార్త
తిరుపతిజిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం చోటు చేసుకుందని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర వెంకటేశ్వరన్ అన్నారు.తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మండలంలోని హిల్ టాప్ జోన్ అని కలెక్టర్ ప్రశంసించారు.ముఖ్యమంత్రి నూతన పరిశ్రమల స్థాపనకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని కలెక్టర్ వివరించారు.జిల్లాలో పరిశ్రమల శాఖ, ఏపిఐఐసి ద్వారా చేపట్టిన కార్యక్రమాల వివరాలను వారి విధులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్బంగా వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు చెన్నై బెంగుళూరు కారిడార్,కృష్ణపట్టణం నోడ్, స్పెషల్ ఎకనామిక్‌జోన్స్ అయిన శ్రీసిటి,మేనకూరు, తడ ఎస్ఇజడ్‌ల ప్రస్తుత స్థితి గతులను సమీక్షించారు. శ్రీకాళహస్తి మండంలోని ఇనగలూరు హిల్‌టాప్ సెజ్,ఈఎంసి 1,2 పాగాలి ఇండస్ట్రియల్ పార్కు, చంద్రగిరిలో ఏర్పాటు చేయబోతున్న ఐటి పార్కు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్బంగా అధికారులతో గతంలో పరిశ్రమలకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. నూతన ఎంఎస్ఎం ఈ పరిశ్రమల స్థాపనకు పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించుటకు పరిశ్రమల శాఖల అధికారులు జవాబుదారి తనంతో కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు కావాల్సిన అనుమతులను సకాలంలో అందజేస్తూ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు నిస్తూ యువతకు ఉపాధి కల్పించే దిశలో అనేక చర్యలు చేపడుతుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలోని ఇనగలూరు, పాగాలిలో అనుకూల వాతావరణం ఉందన్నారు.అక్కడ ప్రజాప్రతినిధి కూడా పరిశ్రమల స్థాపనకు చొరవ చూపుతున్నారని పరిశ్రమల అధికారులకు వివరించారు.

# కౌన్సిల్ అంశాలను పరిష్కరించండి

**నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, కమిషనర్ అధితి సింగ్**



తిరుపతి కార్పొరేషన్, జులై 16, ప్రభాతవార్త
తిరుపతి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను వెంటనే పరిష్కరించాలని మేయర్ డా. శిరీష అన్నారు. వర్షాలు కురుస్తున్న వేళ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధితి సింగ్ అన్నారు. మంగళవారం తిరుపతి నగర పాలక సంస్థ విసి హాల్‌లో మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన నగర పాలక సంస్థ కమీషనర్, అన్ని విభాగముల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేది నిర్వహించబడిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో కనబరిచిన అజెండా అంశంపై, కార్పొరేటర్లు తెలియజేసిన సమస్యలపై తీసుకొన్న చర్యల గురించి చర్చించారు. కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న తీర్మాణములను అమలు పరచుటకు సత్వర చర్యలు తీసుకోవాలని కమిషనర్, అందురు విభాగపు అధిపతులను మేయర్ ఆదేశించారు. కార్పొరేటర్లు అందరు వారి వారి వార్డుల నుండి రాబడిన సమస్యలపై అధికారులు తీసుకున్న చర్యలపై వ్రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు. వర్షాల కారణంగా రోడ్లు, పరిశుభ్రత, పారిశుద్ద్యం పై శ్రద్ధ పెట్టాలి ముఖ్యంగా వర్షాల వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ప్రత్యేకించి యాత్రికులు వస్తారు. కాబట్టి భక్తులకు, నగర ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని, ప్రజలకు పారిశుద్ద్యం పై అవగాహన కల్పించడం పై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ విషయంలో టిటిడి అధికారుల నుండి సహాకారం తీసుకోవాలనుకుంటే తగిన నివేదిక ఇవ్వండి ఎమ్మెల్యే సహకారంతో ఈఓని సంప్రదించి వారి సహకారం తీసుకుందామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, ఎంఇ 2 వెంకటరామిరెడ్డి, ఎంహెచ్ఓ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఆర్ఎఫ్ఓ శ్రీనివాసరావు, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, ఆర్ఓలు వర్మ, సేతుమాధవ్, శానిటరీ సూపర్‌వైజర్లు హాజరైయ్యారు.

## బూత్ లెవల్ అధికారులకు ఎన్నికల భత్యం చెల్లించండి

–ఎన్జీఓ సంఘం నాయకులు ఆర్డీఓకు వినతి

పలమనేరు,జూలై 16 ప్రభాతవార్త:



పలమనేరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారీ కోసం కీలక విధులు నిర్వహించిన బూత్ లెవల్ అధికా రులకు గత రెండు సంవత్సరాలుగా ఎన్నికల భత్యం చెల్లించలేదని ఆ భత్యాన్ని చెల్లించాలని ఎన్జీఓ సంఘం నాయకులు పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షులు ఆనందబాబు మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు,ఏఎన్ఎం,ఆశా ఉద్యోగులు,ఎన్నికల విధుల్లో పాల్గొన్న వివిధ శాఖల సిబ్బందికి ఎన్నికల భత్యాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఇతర నియోజకవర్గంలో ఉద్యోగులకు ఎన్నికల భత్యాలను చెల్లించిన విషయం ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లగా ఇదివరకే ఎన్నికల నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు నిధులు విడుదలైన వెంటనే మంజూరు చేస్తామని ఆర్డీఓ ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్,గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి,జిల్లా అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా మెడికల్ బిల్లులు

– ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్‌కు ఎస్టీయు నాయకులు వినతి

చిత్తూరు టౌన్, జూలై 16 ప్రభాతవార్త:

ఉద్యోగ, ఉపాధ్యాయుల మెడికల్ బిల్లుల మంజూరులో జరుగుతున్న జాప్యంను నివారించాలని రాష్ట్ర ఎస్టీయు నాయకులు గంటామోహన్ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్‌ను మంగళవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీయు నాయకుడు గంటామోహన్ సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్‌తో మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఎన్నో వ్యయ ప్రయాసలు కోరి చికిత్స పొంది మెడికల్ బిల్లుల కోసం దరఖాస్తు చేసుకుంటారని, అయితే చిన్న కారణాలతో బిల్లులకు కొర్రీలు వేస్తున్నారని, జాప్యం చేస్తున్నారన్నారు. దీనిపై సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయంపై సత్వరం చర్యలు తీసుకొని ఎదైనా పెండింగ్‌లో బిల్లులు వుంటే మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## రైతుకు విరివిగా ఖరీఫ్ రుణాలు

– బ్యాంకర్ల భాగస్వామ్యంతో సుస్థిర వృద్ధి

– బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు టౌన్, జూలై 16 ప్రభాతవార్త:




ఖరీఫ్ పంట సాగుకు రైతులకు అవసరమైన రుణాలను బ్యాంకర్లు విరివిగా మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ బ్యాంకర్లకు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన బ్యాంకర్లతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 5 లక్షల మంది రైతులు వున్నారని, రైతు పంట సాగుకు అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువులు కొనుగోలు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడకుండా వుండేందుకు బ్యాంకర్లు చొరవ చూపి రుణాలు మంజూరు చేయాలన్నారు. అలాగే జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగమైన పశుసంవర్థకశాఖ ద్వారా ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వీరికి సైతం పశువుల కొనుగోలు నిమిత్తం రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్ల భాగస్వామ్యంతో జిల్లాలో స్థిరమైన వృద్ధి సాధనకు కృషి చేద్దామన్నారు. బ్యాంకర్ల సమావేశానికి విధిగా ప్రతి బ్యాంకు తరపున జెడ్ఎం లేదా ఆర్ఎం స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ జిల్లాలో 28 పబ్లిక్, ప్రైవేటు, ఆర్ఆర్‌బీ, కో–ఆపరేటివ్ బ్యాంకులు వున్నాయన్నారు. వీటికి సంబంధించి జిల్లాలో 247 బ్రాంచ్‌లు వున్నాయని, క్రెడిట్ డిపాజిట్ రేషియో 138 శాతం వుందన్నారు. ప్రాధాన్యత రంగానికి అడ్వాన్స్‌ల కింద 2024 మార్చి 31 నాటికి 67.17 శాతం ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో వ్యవసాయ రంగానికి 53.51 శాతం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యానికి మించి 106.62 శాతం రుణాలు అందించడం జరిగిందన్నారు. అలాగే డిఆర్‌డిఎ, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయడం జరుగుతున్నదన్నారు. ఈ సమావేశంలో నాబార్డు డిడిఎం సునీల్, ఆర్‌బిఐ ఎల్‌బిఐ నాగప్రదీప్, ఇండియన్ బ్యాంకు డిజెడ్ఎం బాలచంద్రమోహన్, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## వసతి గృహాల తనిఖీ

రొంపిచెర్ల, జూలై 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని కస్తూరిబా బాలికల పాఠశాలను, బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ తనిఖీ చేశారు. పిల్లలందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తాగునీటీ నాణ్యతను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులకు తగిన మందులు అందజేశారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన తప్పని సరి

–డిఎస్పీ విష్ణురఘువీర్

వి.కోట,జూలై 16,ప్రభాతవార్త:



సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిఎస్పీ విష్ణురఘువీర్ సూచించారు. మంగళవారం వి.కోట పట్టణంలోని ఓ సమావేశ మందిరంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నానాటికి సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని విద్యార్థులు,యువత వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని చరవాణిలో వస్తున్న తెలియని ఆన్‌లైన్ లింకులను ఉపయోగించరాదని సూచించారు. సోషియల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులకు వ్యక్తిగత విషయాలను తెలపడం,బ్యాంకుల నుండి పోన్ చేస్తున్నామని బ్యాంకు వివరాలు,ఎటియం వివరాలను ఏవరైన అడిగితే తెలుపరాదని సూచించారు. యువత తప్పుడు మార్గాలలో భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ లింగప్ప,ఎస్ఐ బాబు,కాళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల వేలం ద్వారా రూ.3.95లక్షల ఆదాయం

పలమనేరు,జూలై 16,ప్రభాతవార్త:

ఇటీవల అక్రమంగా మద్యం తరలిస్తు పట్టుబడిన వాహనాలను వేలం వేయడంతో ప్రభుత్వనికి రూ.3.95 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మూడు కార్లు,5 ద్విచక్రవాహనాల వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.395,895 ప్రభుత్వనికి ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి,పలమనేరు సిఐ చంద్రశేఖర్,ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సిఎం కావడంతో పూజలు

కుప్పంరూరల్, జూలై 16 ప్రభాతవార్త



రాష్ట్రానికి మరలా ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కుప్పంకు చెందిన ఐరన్ షాప్ నిర్వాహకుడు సుబ్రమణ్యం మంగళవారం కుప్పం శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి 101టెంకాయలు పగలగొట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నేతలు ఫైరోజ్, యశ్వంత్, జాకీర్, కౌన్సిలర్ జిమ్‌దాము, ఉమాపతి, నరేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## 4.79లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం ధ్వంసం

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



గుడుపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో అక్రమ రవాణాలో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని మంగళవారం చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ శ్రీధర్, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, సెబ్ సిఐ సృజన్ బాబు, గుడుపల్లె ఎస్సై శ్రీనివాసులు అధ్వర్యంలో జెసిబి యంత్రాలతో ధ్వంసం చేశారు. మంగళవారం కుప్పం మున్సిపల్ డికెపల్లి చెరువు వద్దగల మున్సిపాలిటీ డంపింగ్ యార్డు వద్ద 10582 టెట్రా ప్యాకెట్లలో గల 4.79,442రూ.ల విలువ చేసే 1554 లీటర్ల అక్రమ మద్యాన్ని జెసిబిల సాయంతో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సెబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యాధునిక ఆర్టీసీ బస్సుల డ్రైవింగ్‌పై శిక్షణ

కుప్పంరూరల్, జూలై 16 ప్రభాతవార్త

కుప్పం ఆర్టీసీ డిపోలో ఉన్న డ్రైవర్లకు అశోక్ లేలాండ్ కంపెనీ సర్వీస్ ఇంజనీర్ మురళీకృష్ణ అత్యాధునిక బస్సుల డ్రైవింగ్‌పై శిక్షణ కల్పించారు. డిపోకు ఇటీవల కొత్త అశోక్ లేలాండ్ బిఎస్ –6 బస్సులు వచ్చిన నేపథ్యంలో బస్సుల్లో ఉన్న అత్యాధునిక సాంకేతిక మార్పులు, కెఎంపిఎల్ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో డిపో మేనేజర్ పెంచలయ్య, ఎంఎఫ్, యూనియన్ నేతలు బలరాం మూర్తి, వేలు, మునెప్ప, డ్రైవర్లు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాస్త మట్టి అయినా వేయండి...!

–గుంతల రోడ్డుతో అవస్థలు

చౌడేపల్లి, జూలై 16 ప్రభాతవార్త



రోడ్డంతా గుంతలే కొత్తరోడ్డు దేవుడెరుగు కాస్తంత మట్టి అయినా వేయండని స్థానికులు, వాహనదారులు కోరుతు న్నారు. పట్టణంలోని సంతగేటు వద్ద రోడ్డు అద్వాన్నంగా తయారైంది. ముసురు వాన పడితేనే గుంతల్లోకి నీరు చేరి చుట్టుపక్కలున్న వారే కాకుండా వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పరికిదొన, గడ్డంవారిపల్లి, ఆమినిగుంట తదితర గ్రామాలకు ఈ మార్గం గుండానే వెళ్ళాల్సి వుంది. అయితే కొంత మేర రోడ్డు గుంతలమయమై వుండటంతో ఆమార్గం గుండా వెళ్ళేందుకు వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## కమనీయం సీతారాముల కళ్యాణం

చౌడేపల్లి, జూలై 16 ప్రభాతవార్త



మండలంలోని దిగువపల్ల పంచాయతీ కొలింపల్లిలో సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. కొలింపల్లి కట్టపై గల ఆలయంలో నారాయణప్ప అతని కుటుంబ సభ్యులు సీతా, లక్ష్మణా సమేత శ్రీరాముడి విగ్రహాలను ప్రతిష్టింప జేసారు. వేద పండితులచే వివిధ హోమాలు, ప్రాణ ప్రతిష్ట వంటిజరిగాయి. అనంతరం సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద భోజన వసతి కల్పించారు.

## అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సదుం, జూలై 16 ప్రభాతవార్త

విద్యార్థులు ఉన్న చోట్ల అంటువ్యాధులు ప్రబలకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని చెరకువారిపల్లె ప్రాథమిక వైద్యాధికారి చరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను, బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన వార్డన్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంఠ, శిఖామణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు రషీద్, శ్రావణి, ఆరోగ్య కార్యకర్తలు రేవతి, సర్తాజ్, మనోహర్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అదేవిధంగా పలు గ్రామాలలోని మురుగునీటి కుంటలలో మంగళవారం దోమలు వృద్ధి చెందకుండా వాటి లార్వాలను తినేసే గంబూసియా చేప పిల్లలను వదిలారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు.

## బోడేవాండ్లపల్లె నుంచి తిరుమలకు పాదయాత్ర

యర్రావారిపాలెం, జూలై 16 ప్రభాతవార్త

చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తినాని విజయంతో మొక్కు చెల్లించుకునేందుకు తెలుగుయువత ప్రధానకార్య దర్శి బొమ్మల జగదీష్ అధ్వర్యంలో బుధవారం ఉదయం 6 గంటలకు యర్రావారిపాలెం మండలం బోడే వాండ్లపల్లె నుంచి తిరుమలకు పాదయాత్ర చేపడుతునట్లు యర్రావారిపాలెం మండలం తెలుగుయువత ప్రధాన కార్యదర్శి జగదీష్ తెలిపారు. ఉదయం కూరపర్తివారిపల్లె ఆరేటమ్మగుడి వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి బయలు దేరుతామని చెప్పారు. 250 మందితో తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నా మన్నారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కుటుంబసభ్యులు అందరు హాజరు కావాలని కోరారు.

## అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు ఫిర్యాదు

శాంతిపురం, జూలై 16 ప్రభాతవార్త



మండలంలోని సి.బండపల్లి జడ్పీ హైస్కూల్ సమీపంలో నిర్వహి స్తున్న అక్రమ క్వారీపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ శ్రీనివాసులుకు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి తులసినాథ్ వినతిపత్రం అందించారు. సుమారు 250మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారని అయితే పాఠశాలకు కేవలం ఐదు వం దల మీటర్ల దూరంలోనే ఓ వైకాపా నేత క్వారీని నిర్వహి స్తున్నా డని దీనిపై ఇప్పటికే పిసి కమిటీ సైతం ఫిర్యాదు చేసింద న్నారు. పాఠశాల సమీపంలో సర్వే నెం253 లో నిర్వహిస్తున్న క్వారీపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ సంఘటనా స్థలానికి తహశీల్దార్‌ను పంపించి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎవరి మెప్పు కోసం పనిచేస్తున్నారు

– తహశీల్దార్‌పై మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆగ్రహం

సూళ్లూరుపేట, జూలై 16 ప్రభాతవార్త



సూళ్లూరుపేట తహశీల్దార్ గోపాలకృష్ణ ఎవరి మెప్పు కోసం పనిచేస్తున్నారో అర్థం కావడం లేదని, మండలాన్ని ఆయన ఇష్టారాజ్యంగా భావించి పనిచేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం, గృహనిర్మాణశాఖ, సబ్ ట్రెజరీ కార్యాలయాలు సముదాయంగా పురాతన కాలం నుంచి ఉంటున్నాయని, కానీ ప్రస్తుతం ఎలక్షన్ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చిన గోపాలకృష్ణ వీటన్నింటికీ చెక్ పెడుతూ అడ్డంగా గోడలు నిర్మించి కార్యాలయాలకు ప్రజలకు అనువైన విధంగా దారులు లేకుండా చేశారని చెప్పారు. అసలు ఎవరు గోడలు నిర్మించమని కోరారు, ఎలక్షన్ ప్రక్రియలో భాగంగా ఫెన్సింగ్ వేస్తున్నారని, అంతటితో ఆగకుండా ఫెన్సింగ్ తీసేసిన అనంతరం ఆ ప్రదేశంలో గోడలు కట్టమని ఎవరు ఆదేశించారంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గోడలు కట్టేందుకు ఎవరు నిధులు మంజూరు చేశారని ప్రశ్నించారు. ఈ విషయమై ఆర్డీఓను ప్రశ్నించగా, తనకు ఈ విషయమై ఎటువంటి సమాచారం లేదని చెప్పారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై తహశీల్దార్‌ను ప్రశ్నించేందుకు వచ్చినప్పటికీ ఆయన అందుబాటులో లేరన్నారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని సంజీవయ్య చెప్పారు. ఎంపిపి అల్లూరు అనిల్‌రెడ్డి, వైసీపీ నేతలు మీజూరు రామకృష్ణారెడ్డి, చిన్నిసత్యం, కాకి శ్రీరామమూర్తి, ఆబాక రమేష్‌రెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందరివాడు ఆకుతోట రమేష్

– జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 16 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అందరివాడని, పార్టీకి వెన్నెముకలాగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ఆకుతోట రమేష్ జన్మదిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుతోట రమేష్ ఎంతో సౌమ్యుడుగా, అందరినీ కలుపుకొనిపోతూ పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించారని తెలిపారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ప్రస్తుతం పార్టీ పట్టణ అధ్యక్షులుగా అందరినీ కలుపుకొనిపో తూ పార్టీ విజయంలో కీలకభూమిక పోషించారని అన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్థానిక షార్ వై జంక్షన్ వద్ద, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భారీగా కేకులు కట్ చేసి జన్మదిన సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీపార్టీఅధికారప్రతినిధితిరుమూరుసుధాకర్‌రెడ్డి,మేడాసాయినారాయణ,బండారు ఆంజనేయులు, నలబోయిన రాజసులోచనమ్మ, దంతాల రవి, ఎజి కిషోర్, వేమసాని శ్రీనివాసులు నాయుడు, పార్థసారధి,చంద్రారెడ్డి,లింగంవెంకటకొండయ్య, ప్రభుచరణ్‌రెడ్డి, నంద, కుదిరి పెంచల య్య, బుజ్జయ్య, శశి, పలువురు టిడిపి అభిమానులు, తెలుగు యువత కార్యకర్తలు, నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టర్ వెంకటేశ్వర్ కలిసిన ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జూలై 16, ప్రభాతవార్త



కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అంద జేశారు. అనంతరం జరిగిన భేటీలో శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమల గురించి అధికారులతో చర్చిం చారు. పలు భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## ఆడికృత్తిక మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

వెంకటగిరి, జూలై 16, ప్రభాతవార్త



పట్టణం రామలింగేశ్వర స్వామి గుడి ప్రాంతంలో ఉన్న షణ్ముఖ సుబ్రమణ్య స్వామి ఆడికృత్తిక మహో త్సవాలు ఈ నెల 29,30,31 తేదీల్లో జరుగు తాయని నిర్వాహకులు రమేష్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని షణ్ముఖ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిం చారు. సుబ్రమణ్యం స్వామి ఉత్సవ విగ్రహాలను కూడా పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తామని చెప్పారు. ఆడికృత్తిక మహోత్సవాల్లో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. ఆడికృతిక మహోత్సవాల వాల్ పోస్టర్‌ను డాక్టర్ సుమన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు బలిజ సంక్షేమ సంఘం నాయకుడు కృష్ణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు, వెంకట ముని, రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్‌ను తొలగిస్తే ఆందోళన

సిఐటియు నేత చంగయ్య

బాలాయపల్లి, జూలై 16, ప్రభాతవార్త



సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ కృష్ణ వేణి రాజకీయ కక్షతో తొలగిస్తే ఆందోళన చేస్తా మని సిఐటియు నాయకుడు వడ్డిపల్లి చంగయ్య హెచ్చరించారు. బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిఐటియు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం సుబ్రమణ్యం గ్రామంలో గత 19 సంవత్సరములు నుండి ఎటువంటి రిమార్కు లేకుండా విధులు నిర్వహిస్తున్నటువంటి కృష్ణవేణి అనే ఆశ వర్కర్‌ను, రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా అక్రమంగా తొలగించాలని చేస్తున్న ప్రయత్నాన్ని ఆపాలని కోరారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బాలాయపల్లి మెడికల్ ఆఫీసర్ ప్రమీలకి ఎంపిడిఓకి తహశీల్దార్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఏ మంజుల ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కవితలు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలు నుండి ఎటువంటి రిమార్కు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నటువంటి దళిత ఆశ వర్కర్ కస్తూరి కృష్ణవేణి తొలగించి రాజకీయంగా వేరే వారిని పెట్టాలని ప్రయత్నాలు చేయడం చాలా బాధాకరం అన్నారు. ఇప్పటికే సుబ్రమణ్యం గ్రామ డీలర్‌ని, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలుని తొలగించినట్లు తెలుస్తూ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆశ వర్కర్స్ యూనియన్ బాలాయపల్లి మండలం నాయకులు గోపమ్మ సుహాసిని, అమరావతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలవు

బాలాయపల్లి, జూలై 16, ప్రభాతవార్త



గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు ప్రబలవని ఎంఎ డిఓ వి. అరుణ తెలిపారు. మండలంలోని చిలమనూరు గ్రామ పంచాయితీలో జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా ఓ హెచ్ఎస్ఆర్ దగ్గర ఇంజనీరింగ్ అసిస్టెంట్‌చే వాటర్ టెస్టింగ్ నిర్వహించారు. పిగిలాం గ్రామ పంచాయితీలో జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని ప్రతి రోజు అందరు పంచాయితీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించాల్సిందిగా సూచించారు. పిగిలాం గ్రామ పంచాయితీ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో పిఆర్డి సి. శ్రీనివాసులు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్మశాన స్థలాన్ని కూడా వదిలిపెట్టని కబ్జాదారులు

చిల్లకూరు, జూలై 16, ప్రభాతవార్త



చిల్లకూరులో సర్వే నెంబర్ 107లో రెండు ఎకరాలు సుమారు ఐదు కోట్లు విలువచేసే స్మశాన స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించు కున్నారు. కొందరు కబ్జా చేసి లేఔట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. స్మశాన స్థలాన్ని ఆక్రమించి ఆ స్థలంలో చదును చేసేందుకు మట్టి తోలి వున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిల్లకూరు టిడిపి సీనియర్ నాయకులు పట్టాభిరెడ్డి, రామచంద్రారెడ్డి, చిల్లకూరు గ్రామస్తులు చిల్లకూరు తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ ఫిర్యాదును పరిశీలించి మంగళవారం రెవెన్యూ సిబ్బందిని అక్కడకు పంపించి సర్వే నిర్వహించి, జెసిబి ద్వారా ఆక్రమణలను తొలగించారు.

## వీరభద్రుని ఆలయంలో అన్నదానం

గూడూరు, జూలై 16, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని వీర భద్రుని ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మూరు ముని మోహన్ మాట్లాడు తూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నా మన్నారు. దాతల సహకారం మరువలేనిదని అన్నా రు. ఈ కార్యక్రమానికి దాతలుగా పెళ్లూరి అమరావతి కుటుంబ సభ్యులు ఉదయ్ భాస్కర్, దుర్గా దేవిలు వ్యవహరించారు. అదే విధంగా మలపాలెం వీధిలో ఉన్న ఓం సాయిరాం వృధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరికళ్యాణ్,అమరావతి ఉదయభాస్కర్, దుర్గాదేవి దాతల సహాయంతో కార్యక్రమం నిర్వహించారు.

## వృద్ధులకు ఫల సరుకులు వితరణ

గూడూరు, జూలై 16, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ సిఆర్‌రెడ్డి ఫల సరుకులు వితరణ సేవా కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం జనరల్ బాడీ సమా వేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు టౌన్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం యాదవ్, సెక్రటరీ శీనయ్య, ట్రెజరర్, పసుపులేటి ప్రసాద్, గోపినాథ్ రెడ్డి, ఆర్‌వి రావు, ఎంఎల్ఎన్ స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, మురళి నాయుడు, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి

చిల్లకూరు, జూలై 16, ప్రభాతవార్త

మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి అపెక్స్‌బూట్లు ప్రైవేటు పరిశ్రమలో మంగళవారం పరిశ్రమల పనిచేస్తున్న కార్మికులతో జూనియర్ సివిల్ జడ్జి లోకనాథం సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వాడడం వల్ల ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు ఎస్ఐ సుధీర్ కుమార్ కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసు రెడ్డి, పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

చిల్లకూరు, జూలై 16, ప్రభాతవార్త

మండల పరిధిలోని బల్లవోలు గ్రామపంచాయితీలోని దళితవాడకు చెందిన కొట్టు పెంచలయ్య (54)వ్యక్తి సోమవారం రాత్రి వేప చెట్టు ఎక్కి విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ షాక్ గురై అక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సుధీర్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ పొందండి

కోట,జూలై 16 ప్రభాతవార్త

కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కావాల్సిన వినియోగారులు టోల్ ఫ్రీ నెంబరు 1912 ఫోన్ చేసి సర్వీసు పొందవచ్చుని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ, పృధ్వితేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమేరకు ఈ విషయమై కోట సబ్ డివిజన్ ఎడి వర ప్రసాద్ రెడ్డిని ప్రభాతవార్త రైతులు కొత్త కనెక్షన్ కొరకు ఎదురుకుంటున్న సమస్యలపై అడగగా ఆయన మాట్లాడుతూ కొత్త వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు కావాల్సిన వారు మీ సేవా, కేంద్రాలు,గ్రామ సచివాయాలు ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందని రైతులు పట్టాదారు పాస్‌బుక్ నెంబరు, సర్వే నెంబరు వాల్టా సర్టిపికేట్ నెంబరు, కుల ధ్రువీకరణ పత్రం, వంటి వివరాలను పొందపరచాలన్నారు.

## చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన

– స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఎస్పీ ఎవి సుబ్బరాజు

చిత్తూరు టౌన్, జూలై 16 ప్రభాతవార్త:

మహిళలు, విద్యార్థినిలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి వుండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఎస్పీ ఎవి సుబ్బరాజు అన్నారు. ఎస్‌పి సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళలపై జరిగే అన్యాయాలు, నివారణ చట్టాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఇబి ఎఎస్పీ ఎవి సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఇబి ఎఎస్పీ ఎవి సుబ్బరాజు మాట్లాడుతూ మహిళ విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన వుండాలని, ఇవి తమ హక్కులను రక్షించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతాయని, సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. మహిళా రక్షణ చర్యల్లో పోలీసు శాఖ అగ్రభాగంలో నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా రెవెన్యూ అధికారి టెండర్లు మంజూరు

విషనరీ అధినేత బుజ్జి బాబు నాయుడు

తిరుపతి హెల్త్, జులై 16, ప్రభాతవార్త




తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే టెండర్ల షెడ్యూల్ విషయంలో అక్కడ విధులు నిర్వహించే కెవిల్‌వర్మ అనే రెవెన్యూ అధికారి తన ఇష్టానుసారంగా టెండర్లు మంజూరు చేస్తున్నారని విషనరీ గ్రూఫ్ అధినేత బుజ్జి బాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ అధికారి చట్టాన్ని తన చేతిలో తీసుకొని ఎవరైతే అర్హులుగా ఉన్నారో వారికి షెడ్యూల్ ఇవ్వకుండా తనకు ఇష్టమైన వారికే కట్టబెడుతూ ఉన్నారని ఆయన ఆరోపించారు. కార్పొరేషన్ పరిధిలో ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, పట్నాల్ స్ట్రీట్ మార్కెట్, ఇతర మున్సిపల్ పరిధిలో ప్రాంతాల్లోని పార్కింగ్‌లకు మార్కెటింగ్లకు, టెండర్లను బహిరంగ వేలం ద్వారా కార్పొరేషన్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి తనకు అనుకూలమైన వారికి ఆఫీస్ కార్యాలయంలో కూర్చుని పెట్టి ఇస్తున్నారని మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇలాంటి అధికారిపై రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రి, పురపాలక మంత్రి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కాంద్ర లక్ష్మీపతి నాయుడు, లోకేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఆడికృతిక ఏర్పాట్లపై అధికారులతో ముందస్తు సమావేశం

పాకాల, జులై 16, ప్రభాతవార్త



మండలంలోని ఉప్పరపల్లి పంచాయితీ ఊట్లవారిపల్లి సమీపం లో ఆనందగిరిపై వెలిసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులు, ఉభయ దాతలు, స్థానికులతో ఆడికృత్తిక ఏర్పాట్లపై ముందస్తుగా సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖ అధికారులతో చర్చించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆలయం పరిసరాల చుట్టు శానిటేషన్ చేయించాలని, ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు యంత్రాంగం ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, అధికారులు, ఉభయ దాతలు తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి- డాక్టర్ నందిని

పెద్దపంజాణి జూలై 16 ప్రభాతవార్త :



జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నందిని పేర్కొన్నా రు. మంగళవారం మండలంలోని బసవరాజుకండ్రిగలో ఇటీవల భావన అనే చిన్నారికి డెంగ్యూ జ్వరం రావడంతో వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించారు. అలాగే పారిశుద్ధ్య చర్యలు, మంచినీటి ట్యాంకుల శుభ్రత ఎప్పటికప్పుడు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చేయిస్తున్నారు. కాగా బసవరాజుకండ్రిగలో మరికొంతమంది జ్వరాలతో బాదపడుతున్న నేపథ్యంలో రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నందిని పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, సంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, ఎంఆర్‌సీ సుధాకర్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ, పీహెచ్‌ఎస్ శమంతకమణి, ఎంపిహెచ్‌ఓ శ్రీనివాసులు, రాధాకృష్ణ, వరలక్ష్మి, ఏఎన్‌ఎం సుజాత, అంగన్వాడి కార్యకర్త సునీత, ఆశాలు లలిత, నాగేశ్వరి, బాగవతి, సుబ్బమ్మ, జ్యోతమ్మ, భారతిలు పాల్గొన్నారు.

# మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

పెద్దపంజాణి జూలై 16 ప్రభాతవార్త :



కుటుంబ ఆర్థిక అభివృద్ధికోసం మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని పుంగ నూరు సహకార కేంద్రబ్యాంకు మేనే జర్ రాణి అన్నారు. మంగళవారం స్థానిక సహకార బ్యాంకు కేంద్రం లో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత మ్యూజిక్‌షో, పాటలు, మాటలద్వారా మహిళలకు అర్థంఅయ్యే విధంగా ఎం.వీ. రూరల్ ఫోక్‌ఆర్ట్ ఆర్గనేజేషన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు వ్యవసాయ, బంగారంపై రుణాలను తక్కువ వడ్డీలతో రుణాలు అందిస్తున్నామని అదేవిధంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమాయోజన పథకం, సురక్షభీమా యోజన పథకం, అటల్ పెన్షన్‌యోజన పథకం, డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైం మోసాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గిరివాణి, రోహిత్, సి.ఈ.ఓ చంద్రశేఖర్ అక్రమ్‌భాషా, గ్రామ ప్రజలు, బ్యాంకు సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు మేజీషియన్ విజయ్. డప్పు చిరంజీవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రిఫార్మ్ 2024 వర్క్‌షాప్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం



వైస్ చాన్సలర్ ప్రొ. జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి విద్య, జులై 16, ప్రభాతవార్త

బెంగళూరులో రిఫార్మ్స్ 2024 న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్యానల్ డిస్కషన్ ఇన్‌బైనరీ అక్రిడేషన్ రీజనల్ కన్సల్టేటివ్ వర్క్ షాప్‌లో పాల్గొన్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ. జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో శిక్షా వ్యవస్థలో చేయాల్సినటువంటి రిఫార్మ్స్, అదే విధంగా సంస్కృత భాష ద్వారా భారతీయ సమాజంలో తీసుకురావాల్సినటువంటి ఆవిష్క రణలు అంశాలపై వివరించుట జరిగింది. తద్వారా భారతీయ జ్ఞానాన్ని ప్రతి ఒక్కరికి అందించవచ్చని, సంస్కృతం ద్వారానే భారతీయత, భారతదేశ అభివృద్ధి జరుగుతుందని ఆయన వివరించడం జరిగింది. మన దేశ ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని అందరూ కూడా తెలుసుకోవాలని, తద్వారా దేశ, విద్యా పురోగతి మరింతగా ముందుకు వెళుతుందని వివరించారు.

# రేపు మార్కెట్లు, పార్కింగ్ స్థలాలకు బహిరంగ వేలం

నగర మేయర్ డా. శిరీష, కమిషనర్ అధితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, జులై 16, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని మార్కెట్లకు, పార్కింగ్ స్థలాలకు 18వ తేది ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడునని, సీల్డ్ టెండర్ల ద్వారా పాల్గొనని నేరుగా బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునని నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్ తెలిపారు. బహిరంగ వేలంలో డిపాజిట్ చెల్లించి నిబంధనల మేరకు అర్హులైన అందరూ పాల్గొనవచ్చునని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అధితి సింగ్ తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ సముదాయం, రామచంద్ర గుంటకట్ట కూరగాయల మార్కెట్, జంతు వధశాల, పార్కింగ్ స్థలాకు మార్చి 31, 2025 వరకు రుసుము వసూలు చేసుకొనుట కొరకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు నగర పాలక సంస్థ ఉప కమిషనర్‌ని సంప్రదించాలని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అధితిసింగ్ తెలిపారు. నిబంధనలు ప్రకారంజరుగుబహిరంగ వేలంకు గురువారం ఉదయం 10 గంటలకు హాజరు కాగలరని తెలియజేసారు.

# నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి క్రీడ, జులై 16, ప్రభాతవార్త



జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని తిరుపతి విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్ర అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తే అత్యున్నత ప్రమాణాలతో సిబిఎస్ఈ సిలబస్‌తో ఉచితంగా చదువు, వసతి, భోజనం కల్పిస్తారని, రెగ్యులర్ చదువుతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈ జవహర్ నవోదయాలు దేశవ్యాప్తంగా 653 ఉన్నాయి. వీటిలో ఏపిలో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్టంగా 80 మంది విద్యార్థులకు ఆరవ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు 2025 - 26 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదువుతున్న వారు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు రాయడానికి అర్హులు అని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025న, దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేది 16 సెప్టెంబర్ అని తెలిపారు. 2024 నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యా సంస్థల నందు శిక్షణ పొందిన 52 మంది విద్యార్థులు సీట్లు సాధించి రికార్డు సృష్టించారని తెలిపారు. పరీక్షకు సంబంధించి మరిన్ని వివరాల కొరకు 8688888802, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

# వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

-ఎంవిఐ దామోదర్‌నాయుడు




శ్రీకాళహస్తి, జులై 16 ప్రభాతవార్త

వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను నడపాలంటూ శ్రీకాలహస్తి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపి వ్యక్తులు మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడుపరాదని తెలిపారు. నిర్లక్ష్యం కారణంగానే ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగుతున్నాయని, సాధారణంగా వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కారునడిపే వ్యక్తులు తప్పనిసరిగా బెల్టు ధరించాలని ప్రమాదవశాత్తు ఏమైనా ప్రమాదం జరిగితే వెంటనే ఆకారులో ఉన్న గ్యాస్‌బ్యాగులు ఓపెన్ అయి ప్రమాదాన్ని అరికడుతాయన్నారు. తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ప్రతి ఒక్క వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకుని వాహనాలు నడపాలని తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు.

# వృద్దులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

శ్రీకాళహస్తి, జులై 16 ప్రభాతవార్త



పట్టణంలోని భరద్వాజసదన్‌లో ఉన్న వృద్ధాశ్రమం లోని వృద్దులకు మంగళవారం రోటరీక్లబ్ అధ్యక్షురాలు శైలజ ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు, వృద్దులకు కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీచేశారు. కార్యక్రమా నికి బిజెపి సీనియర్ నాయకురాలు కండ్రిగ. ఉమహజరయ్యారు. ఈసంద ర్భంగా కండ్రిగ, ఉమ, రోటరీక్లబ్ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ రానున్న శీతాకాలం దృష్ట్యా వృద్దులకు చలి ఎక్కువగా వీస్తుండడంతో వారికి దుప్పట్లు అవసరమవుతాయని శ్రీకాళహస్తిలోని భరద్వాజసదన్‌లో ఉన్న వృద్దులకు అవసరమైన సామగ్రిని పంపిణీచేశామన్నారు. కార్యక్రమంలో ప్రమీలమ్మ, శైలజ, డాక్టర్ వెంకటరమణ, చీరాలసిల్క్స్ హౌస్ నాగేశ్వరరావు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# యోగా పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ



తొట్టంబేడు, జూలై 16 ప్రభాతవార్త

కర్నాటక స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగుళూ రులో నిర్వహించిన యోగా దినోత్సవంను పురస్కరిం చుకుని ఈనెల 14వ తేదీన జరిగిన ఇంటర్‌స్టేట్ యోగా పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన అయిలం సుజాత తన ప్రతిభను కనపరిచి ఈపోటీలో ప్రథమ స్థానం సాధించారు. శ్రీకాళహస్తిలోని జయరామరా వువీధిలో శ్రీశివసాయి యోగా సెంటర్‌లో గురువుగా ఉన్న సుజాత ఎంతో మందికి శిక్షణ అందిస్తున్నారు. ఈ పోటీల్లో యోగా సెంటర్‌లో శిక్షణ పొందిన సోహిత ద్వితీయ స్థానం, మరియు నవనీత్ తృతీయ స్థానం సాధించారు. ఈసందర్భంగా వీరికి నిర్వాహకులు సర్టిఫికెట్‌తో పాటు పతకాలను అందించి సత్కరించారు

# శ్రీకాళహస్తి ఎస్‌టి సెల్ అధ్యక్షుడికి సత్కారం

శ్రీకాళహస్తి, జులై 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం. సుబ్బయ్యకు వెలగ పూడి సచివాల యంలో రాష్ట్ర గిరిజన అధ్యక్షులు, పార్లమెంటు అధ్యక్షులు అందరు కలసి దుశ్శాలువతో సత్కరిం చారు. గత ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల కోసం కొన్న పోరాటలు, అక్రమ కేసులు పెట్టించుకుని మూడు నెలలు జైలు జీవితం గడిపి జగన్‌రెడ్డి చేసే అరాచకాలు, నియోజకవర్గంలో బియ్యపుమధుసూధన్‌రెడ్డి చేసే అరాచకాలకు ఎదురుండి నిలబడిన పోరాడిన వ్యక్తి సుబ్బయ్య ఒక్కరే అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర గిరిజనఅధ్యక్షులు, పార్లమెంటు అధ్యక్షులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించండి



శ్రీకాళహస్తి, జులై 16 ప్రభాతవార్త

నాయుడుపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అస్వస్తతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం కల్పించాలని జైభీం ఆర్మీ అధ్యక్షుడు పులిశ్రీకాంత్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పులిశ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థు లకు మెరుగైన వైద్యంతో పాటు కలుషితం లేని నీరు, తాజా కూరగాయాలు, తాజా మాంసాహారాలు మరియు విద్యార్థులు చదువుకునేందుకు లైటింగ్ సౌకర్యం, రాత్రివేళల్లో పడుకునేందుకు బెడ్లు నిలువ చేసిన ఆహారపదార్థాలు ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్‌పై ఉందని తెలిపారు. వసతిగృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వినతిపత్రంఅందించిన వారిలో జైభీం ఆర్మీ నాయకులు ప్రసన్న, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన మున్సిపల్ ఉద్యోగులు

శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతా ల్లో చోటు చేసుకున్న మురుగునీటి సమస్యను మంచినీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యలనుయుద్ధ ప్రాతిపదికపై మున్సిపల్ సిబ్బంది పరిష్కరిస్తు న్నారు. ఈ నేపధ్యంలో దర్గా మిట్ట మలుపు బాలాజి లైన్ దగ్గర ప్రధాన పైప్‌లైన్ లీకేజితో మురుగునీరు కలసి 32 వ వార్డు ప్రజలకు దుర్గంధంతో కూడిన నీరు సరఫరా అయ్యేది. ఈ సమస్యను ఆ వార్డు ప్రజలు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి మున్సిపల్ అధికారులతో పాటు వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, యశ్వంత్, మునిరాజాయాదవ్, షాహబుద్దిన్ ఐటిడిపి రేవంత్‌లు చొరవ చూపారు. మంగళవారం మున్సిపల్ సిబ్బంది చొరవకు వార్డు ప్రజలు అభినందించారు.

# మోసపోయిన సొమ్మును బాధితులకు ఇప్పించండి

తిరుపతి హెల్త్, జులై 16, ప్రభాతవార్త




స్థానిక శివశక్తి కళ్యాణ మండపం యాజమానికి తాను బంధువని చెప్పు కుంటూ ఎంతో మంది దగ్గర కోట్ల రూపాయిలు దండు కున్న మణికంఠ నుంచి తిరిగి తమ సొమ్ము దక్కేల పోలీస్ అధికారులు తమకు న్యాయం చేయాలని బాధుతులు సాయికృష్ణ, శ్రీకాంత్, రూపేష్, సత్యనారాయణ, పెంచలయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ మంగళవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ మోసగాడు మణికంఠ ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర లక్షల్లో వసూలు చేసి నేడు మణికంఠ ఆఫీసు దగ్గరికి వెళ్లి ప్రశ్నిస్తే నీవల్ల ఏమవుతుందో చేసుకోమని దాడికి సైతం దిగుతున్నాడని ఒక్కోసారి తాను ఆత్మహత్య చేసుకుంటానని తమను బెదిరిస్తున్నాడని వాపోయారు. తిరుపతిలో పలుచోట్ల మణికంఠకు బంధువులు, స్నేహితులు, సన్నిహితులు ఉన్నారని వీరందరి వద్ద అధిక మొత్తంలో సొమ్మును దండుకున్నాడని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ఎస్పి తదితర వారిని ఎన్నోసార్లు కలిసినా న్యాయం జరగలేదన్నారు. నేటి కూటమి ప్రభుత్వం ద్వారానైనా తమకు న్యాయం జరగాలని వేడుకున్నారు.

# తిరుపతి డివిజన్

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి



– సీపీఐ కార్యదర్శి కోదండయ్య డిమాండ్

నగరి, జూలై 16 ప్రభాతవార్త:

నగరి నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఇచ్చిన క్వారీ లైసెన్సులను రద్దు చేయాలి, నగరిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుక అక్రమాలను అరికట్టాలని, టిక్కో ఇళ్ళకు డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని నగరి సీపీఐ పార్టీ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో మండల స్థాయిలో జరిగే సమీక్ష సమావేశాల్లో పాల్గొన్న నగరి ఎమ్మెల్యే ప్రధానంగా క్వారీలకు సంబంధించి, అక్రమ మట్టి తరలింపు ఇసుక తరలింపు పైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పడాన్ని సీపీఐ స్వాగతిస్తుందన్నారు. కానీ నగరిలో ఇప్పటికీ అక్రమ ఇసుక జరుగుతుందని, ఎమ్మెల్యే చెప్పినా కూడా అధికారులు స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. సీపీఐ ప్రధాన డిమాండ్‌గా గత ప్రభుత్వం ఇచ్చిన క్వారీ లైసెన్స్ రద్దు చేసి ఆ క్వారీల్లో ప్రభుత్వం ఇచ్చిన కొలతలకు వారికి ఇచ్చిన విస్తీర్ణంకు నిబంధనలకు అనుకూలంగా మట్టి తీశారా... లేక అక్రమంగా తీశా...మొత్తం సర్వే చేసి అక్రమాలను తేలినట్లయితే వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరి మున్సిపాలిటీలో గతంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వంలో టిక్కో ఇళ్ల కోసం అప్పట్లో మున్సిపల్ కమిషనర్ అకౌంట్‌లో డబ్బులు చెల్లించడం జరిగింది. నాగరాజుకుప్పం వద్ద టిక్కో ఇళ్ళకు సంబంధించి ఫౌండేషన్ వరకు వేసి ప్రభుత్వం మారిన వెంటనే ఆపేశారని, లబ్ధిదారులకు డబ్బులు తిరిగి చెల్లించలేదని, కావున ఎమ్మెల్యే లబ్ధిదారులకు న్యాయం చేయాలని తెలిపారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, పట్టణ నాయకులు బాషా, విజయకుమార్, శేఖర్, సిరావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎంఎల్ఏ పులివర్తి నాని ఆదేశం

చంద్రగిరి, జూలై 16 ప్రభాతవార్త:



రాయలపురం, నూకలగుంట, విజయనగర్ కాలనీలో తరచూ తలెత్తుతున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. స్థానిక విజయనగర్ కాలనీలో వరదనీటితో పాటు మురుగునీటి ప్రవాహాన్ని మంగళవార ం ఆయన పరిశీలించారు. చంద్రగిరి పంచాయతీ, విజయనగర్ కాలనీలో నూకలగుంట మురుగునీటితో పాటు వర్షపునీటి ప్రవాహంతో ఎదురవుతున్న ఇబ్బందులను కాలనీ వాసులు ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్ళడంతో హుటాహుటిన ఇక్కడికి చేరుకున్న ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యంతో చిన్నపాటి సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాయలపురం, చంద్రగిరి, నూకలగుంట, విజయనగర్ కాలనీ మీదుగా తొండవాడ డ్రైనేజీ కాలువలకు వరదనీటి ప్రవాహాన్ని అనుసంధానం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీవిద్యా డిగ్రీ కళాశాల జాబ్ డ్రైవ్‌లో 22 మంది ఉద్యోగాలకు ఎంపిక

పుత్తూరురూరల్, జూలై 16 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపాలిటీ గోవిందపాళెంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళా లో 24/7 ఏఐ ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగాలకు 140 మంది పాల్గొనగా వివిధ దశలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 22 మంది అభ్యర్థులు నియామకం చెందినట్లు మేజిక్ బస్ ఫౌండేషన్ చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి. వెంకటప్రసాద్ తెలియజేశారు. ఎన్నికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ మేనేజర్లు నియామక పత్రాలను అందజేశారు. శ్రీవిద్యాకళాశాలచైర్మన్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ మాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 24న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి జూలై 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం నందు ఈ నెల 24న హుండి లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌వివిఎస్‌ఎన్ మూర్తి మంగళవారం తెలిపారు. దక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందోన్నారు. ఈ లెక్కింపుకు ఆలయ ఉద్యోగులు, సేవకులు, బ్యాంక్ సిబ్బంది ఉదయం 7 గంటల నుంచి హాజరవ్వాలని ఆయన తెలియజేశారు. నిబంధనలను పాటిస్తూ పారదర్శకతతో నిర్ణీత సమయంలో హాజరు కావాలని కోరారు.

## పంచామృత దిన్నెల బహూకరణ

శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరునికి భక్తుల నుంచి విరాళాల వెల్లువ పారుతుంది. ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతానికి చెం దిన భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఈ నేప థ్యంలో మంగళవారం నాయుడుపేటకు చెందిన సురేష్, రమేష్‌లు స్వామి అమ్మవార్లకు పంచామృత తయారి వెండి గిన్నెలను అందించారు. శ్రీకాళ హస్తీశ్వరాలయంలో ప్రతి రోజూ ఐదు కాలాల్లో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అందుకు ఉపయోగించు పది గిన్నెలను అందించారు. అలాగే పాలసేకరణకు కూడా ఒరెండు క్యాన్లు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎసి మల్లికార్జున్ ప్రసాద్, పిఆర్ఓ సుబ్రమణనయం, రవి తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ మృతి

శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు డైరెక్టర్‌గా సమర్థవంతంగా పని చేసి బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారుల మనోభావాలకు అనుగుణంగా పని చేసిన ఆవుల కన్నయ్య మంగళవారం హఠాన్మరణం పొందారు. శ్రీకాళహస్తిలోని కొండమిట్ట ప్రాంతంలో సుపరిచయస్తులైన ఆవుల కన్నయ్య మృతికి పలువురు సంతాపాలు తెలిపారు. శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఛైర్మెన్ శెట్టిపల్లి సురేష్ తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి పని చేసిన ఓ క్రమశిక్షణ కల్గిన వ్యక్తిని కోల్పోయామన్నారు. కాగా శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు సిబ్బంది, పాలకమండలి సభ్యులు బ్యాంకు ఖాతాదారుల తరపున సంతాపం తెలిపారు.

## ద్విచక్రవాహనాల రికార్డులను పరిశీలించిన ఎస్ఐ

శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో కొందరు యువకులు, ఆకతాయిల ఆగడాలు పెచ్చుపెరిగాయి. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్ తీసివేసి శబ్దం చేసుకుంటూ జనాన్ని భయభ్రాంతుల్ని చేస్తూ రైడింగ్ చేయటం అలాగే ట్రిబుల్ రైడింగ్ కొందరు యువకులు లైసెన్సులేకుండా డ్రైవింగ్ చేయటం వాహనాలకు రికార్డులను దగ్గర పెట్టుకోక పోవటం జరుగుతుంది. ముఖ్యంగా బిజీగా ఉండే సమయంలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. దాంతో ఆకతాయిల ఆట కట్టించుటకు ఎస్ఐ అరుణ, ఎఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్స్ మంగళవారం సాయంత్రం రామసేతు మలుపువద్ద ద్విచక్రవాహనాల రికార్డులను పరిశీలించటం లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తున్నవారికి జరిమానాలు విధించారు.

## వికృతమాల టిసి సెంటర్లో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయండి

శ్రీకాళహస్తి జూలై 16 ప్రభాతవార్త



వికృతమాల టిసిఎల్ ఎసెంటర్‌లో ట్రాఫిక్ ఐలాండ్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని మంగళవారం సం బంధత అదికారికి కార్మికులు వినతి పత్రం అందిం చారు. డిక్సన్ నుంచి టిసిఎల్ వరకు ఉన్న రోడ్ మీద ఇప్పుడు కంపెనీలో పని చేసే ఉద్యోగులు వారు పయనించే బస్సులు, పరిశ్రమల అవసరాల కోసం వచ్చే లారీలు భారీ వాహనాలతో అధిక రద్దీ ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనితో వికృతమాల టిసిఎల్ ఎసెంటర్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ రోడ్ నుంచే ఇఎంసి1, 2, లో ఉన్న సుమారు 50 పైబడిన ఉద్యోగులు పరిసర గ్రామాల ప్రజలు పయనిస్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి ప్రమాదాలను కట్టడి చేయటానికి నివారించటానికి రోడ్డుకు అన్ని వైపులా స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ పూల హేమాక్షి, ఏర్పేడు జడ్‌పిటిసి డాక్టర్ కావేరి తిరుమలయ్యలు ఏపిఐఐసి జోనల్‌మేనేజర్ చంద్రశేఖర్‌కి విన్నవించారు. మూడురోజుల్లో ఏర్పాటు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## పిఎం విశ్వకర్మ చేతివృత్తుల దరఖాస్తుల పరిశీలన

.తొట్టంబేడు, జూలై 16 ప్రభాతవార్త

కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ చేతివృత్తుల పథకం ద్వారా తొట్టంబేడు మండలంలో వివిధ చేతివృత్తుల వారు సుమారు 320మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపిడిఓ తెలిపారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలు పరిశీలించాలని సంబందిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు.

# యువకుడిపై హత్యాయత్నం!...తడలో సంచలనం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

తడ, జులై 16 (ప్రభాతవార్త) : తడలో మంగళవారం పట్టపగలు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన యువకుడిపై హత్యాయత్నం జరిగింది. అతనితో వివాహేతర సంబంధం వున్న యువతి భర్త ఈ దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు నీలాపు మోనిక పోలీసులకు ప్రాథమిక సమాచారం అందించినట్లు తెలిసింది. కాకినాడకు చెందిన బావన్నధార కాలనీ వాసి నీలాపు రవీంద్రబాబుకు వదేళ్ల క్రితం మోనికతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే అనంతరం భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో తునికి చెందిన సతీష్‌కుమార్‌తో పరిచయం పెంచుకుంది. అతనితో కలిసి నాలుగు నెలల నుంచి సహజీవనం చేస్తున్నట్లు సమాచారం. ఆ క్రమంలో నెల నుంచి మోనిక, సతీష్‌కుమార్‌లు తడ హైస్కూలు వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే మోనిక భర్త రవీంద్రబాబు వీరిని వెతుక్కుంటూ తడలో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని మంగళవారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం 8.15 గంటల సమయంలో సతీష్‌కుమార్ సమీపంలో ఉన్న ఒక కంపెనీకి విధుల కోసం నడిచి వెళుతుండగా తడకండ్రిగలోని కోవెలమ్మ ఆలయం వీధిలో కత్తితో దాడికి పాల్పడ్డాడు. సతీష్‌కుమార్ ముఖంపై రాడ్డుతో కొట్టి అనంతరం తీవ్రంగా గాయపరిచినట్లు, చుట్టుపక్కల వారు అతన్ని సకాలంలో రక్షించినట్లు చెప్తున్నారు. ఇతన్ని చికిత్స నిమిత్తం శ్రీసిటీలోని రామచంద్రా ఆసుపత్రికి పంపించి ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో పోలీసులు మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. తన మొదటి భర్త రవీంద్రబాబు కక్షకట్టి సతీష్‌కుమార్‌పై దాడి చేసి పారిపోయి ఉంటాడని అనుమానిస్తున్నట్లు మోనిక పోలీసులకు సమాచారం అందించింది. ఈ మేరకు ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బెల్జియం విద్యార్థులకు ఎపి భోజనం

**- రుచి బ్రహ్మాండ మంటూ ఆరగించిన విద్యార్థులు**

శ్రీరంగరాజపురం, జులై 16 ప్రభాతవార్త: బెల్జియం దేశానికి చెందిన విద్యార్థి బృందం ఆంధ్రప్రదేశ్ భోజనం అద్భుతం, రుచి బ్రహ్మాండ మంటూ లొట్టలు వేసుకొని తిన్న సంఘటన శ్రీరంగరాజపురం మండలం కటికపల్లి పంచాయతీలో మంగళవారం జరిగింది. బెల్జియం దేశానికి చెందిన 24 మంది విద్యార్థుల బృందంకు శ్రీరంగరాజపురం కటికపల్లికి చెందిన మాజీ వాటర్‌షెడ్ ఛైర్మన్, రైతు నాయకులు గుణశేఖర్‌నాయుడు ఆతిథ్యం ఇచ్చారు. గుణశేఖర్‌నాయుడు బెల్జియం విద్యార్థులకు ఇక్కడి భోజన పదార్థాలు పరిచయం చేయడంతో వారు లొట్టలు వేసుకొని తిన్నారు. బెల్జియం విద్యార్థులకు ఇడ్లీ, సాంబార్, వడ, పచ్చడి లాంటి వాటిని స్వయంగా వడ్డించి వీటి గురించి బెల్జియం విద్యార్థులకు వివరించారు. బెల్జియం దేశానికి చెందిన విద్యార్థుల బృందం మండలం లోని పిల్లిగుండ్లపల్లి ఎస్టీ కాలనీ జీవన వైవిధ్యంపై పరిశోధన భారత దేశంలో గ్రామీణ జీవనం, తీరుతెన్నుల పరిశీలన కోసం వచ్చారు. వీరు పిల్లిగుండ్లపల్లి ఎస్టీ కాలనీలో రైతులకు కలిసిపోయి ప్రకృతి నుండి వివిధ రకాల మూలికల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బెల్జియం విద్యార్థుల బృందం జీవ వైవిధ్యంపై ఎస్టీ కాలనీ వాసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్టీలు తీసుకునే ఆహారం సహజంగా అడవిలో లభించే మూలికలు, మాసాహారాలు లాంటి వాటి గురించి వారు ఉత్సాహంగా తెలుసుకున్నారు. అనంతరం బెల్జియం విద్యార్థులు గ్రామంలోని కుటుంబాలతో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం వారు కేరళ తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ కార్యక్రమంలో పిల్లిగుండ్లపల్లి ఎస్టీ కాలనీ రైతు నాయకుడు గుణశేఖర్‌నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


బెల్జియం విద్యార్థులకు ఆంధ్రా భోజనం చేస్తున్న దృశ్యం

## 6వ తరగతి విద్యార్థినికి కలెక్టర్ ఆర్థిక సహాయం



చిత్తూరు టౌన్, జులై 16 ప్రభాతవార్త: చిత్తూరు సంతపేట బండ్లవీధికి చెందిన 6వ తరగతి విద్యార్థిని హెచ్. టింపుల్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జులై 1వ తేదీన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంతపేట బండ్లవీధికి చెందిన లేట్ హరికుమార్ కుమార్తె హెచ్.టింపుల్ హాజరై కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తన తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందారని, తాను ప్రస్తుతం పెద్దమ్మ జయలక్ష్మి సంరక్షణలో వున్నానని, తనకు వారే విద్య, వైద్య ఖర్చులు భరిస్తున్నారని, వారే వారి జీవనం సాగించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ పరిస్థితుల్లో తాను వారికి భారంగా మారానని తనను ఆదుకోవాలని కోరింది. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద 25 వేల రూపాయల చెక్కును హెచ్.టింపుల్, ఆమె సంరక్షకురాలు జయలక్ష్మికు మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అందజేశారు. జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డిలు పాల్గొన్నారు.

## మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, జులై 16, ప్రభాతవార్త : పట్టణంలోని మాసాపేట బజార్ వీధిలో ఉన్న మసీదు వద్ద నిర్మించిన పీర్ల వేడుకల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. పీర్ల సందర్శనం ఏర్పాటు చేసిన అగ్ని గుండ మహోత్సవాన్ని ఆయన వెలిగించారు. పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్ల వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రామకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. మతాలకు అతీతంగా పీర్ల పండుగ వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు నాయుడు నరసింహులు, ఆనంద్, శ్రీనివాసులు, చంద్రరెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు వారాలుగా అందని ఉపాధి హామీ బిల్లులు

కోట,జులై 16 ప్రభాతవార్త : ఆరు వారాలు దాటినా ఉపాధి హామీ కూలీల వేతన బిల్లులు అందకపోవడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.మరో వైపు ఉపాధి పనులు బకాయి సొమ్ములు అందక పూట గడవక కష్టంగా మారిందని పేద కుటుంబాలకు చెందిన అనేక మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే,జూన్,జులై నెలల్లో ఫీడర్ ఛానల్,అమృత్ సరోవర్ కింది పొలంలో నీటి కుంటలు,చెరువులు పూడికతీత ,మట్టి రహదారుల నిర్మాణం,రైతుల పొలాల్లో నీటి నిల్వల కందకాలు తదితర పనులు చేశారు.వీరికి వేతనాల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడంలో క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో కూలీ సొమ్ము బ్యాంకు,పోస్టాఫీసు ఖాతాల్లో జమయ్యేవి.ఎన్నికల నేపథ్యంలో ఈ ధపా బడ్జెట్ కేటాయింపనచేయకపోవడంతో జిల్లాలో సుమారు మే 21 నుంచి జులై 12 వ తేదీ వరకు పూర్తయిన పనులకు నగదు విడుదల కాలేదు.జిల్లాలో 36 మండలాల్లో దాదాపు రూ 130 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. బకాయి సొమ్ములు అందకపోవడంతో నిత్యావసర సరుకు కొనుగోలు ,ద్విచక్ర రుణం చెల్లింపు కుటుంబ అవసరాల నిమిత్తం ఇతరుల వద్ద చేబదులు తీసుకునే పరిస్థితి వచ్చిందని పలువురు వేతనదారులు అంటున్నారు. బకాయిలు చెల్లించాలంటూ కూలీలు కోరుతున్నారు.

## శ్రీవారికి శ్రీరంగం పట్టువస్త్రాలు



తిరుమల, జులై 16(ప్రభాతవార్త): సౌరమానాన్ని అనుసరించి తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరిరోజు నిర్వహించే కొలువుకావడంతో ఆణివార ఆస్థానంగా పేరు వచ్చింది. శ్రీరంగం లోని రంగనాథస్వామి నుండి శ్రీవారికి తమిళనాడు దేవాదాయశాఖా మంత్రి శేఖర్‌బాబు, ప్రభుత్వ దేవాదాయశాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్, శ్రీరంగం ఆలయ ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్ ఆరు పట్టువస్త్రాలను భక్తితో తీసుకువచ్చారు.

## ఏమి హతవిధి

**- రివర్షన్ ఉత్తర్వులు సైతం ఇవ్వలేని విద్యాశాఖ**

చిత్తూరు టౌన్, జులై 16 ప్రభాతవార్త:ఏ శాఖలోనైనా ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని ఆ శాఖ ఉన్నత అధికారులకు చలి జ్వరం వస్తుంది. ఇక్కడ ఇచ్చిన పదోన్నతులను వెనక్కి తీసుకొని తమకు రివర్షన్ ఇప్పించండి బాబు అని వేడుకుంటున్నప్పటికీ ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖలో పలువురు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినప్పటికీ వారిలో కొంతమంది అనారోగ్య కారణాలతో తమకు పదోన్నతులు వద్దని తమకు ఇది వరకు వున్న కేడర్ చాలని మొర పెట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఉన్నత అధికారులను కలిసి తమ పదోన్నతులను రద్దు చేయాలని రాత పూర్వకంగా ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించలేదు. దీనిపై ఎస్టీయు నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎడి వెంకటేశ్వరరావును కలిసి పదోన్నతులు వద్దని రాసి ఇచ్చిన ఉపాధ్యాయులకు రివర్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తమ పదోన్నతులు వద్దని తాము ఇది వరకు విధులు నిర్వహిస్తున్న కేడర్‌లోనే ఉద్యోగాలు చేస్తామని కొంతమంది స్పష్టం చేసినా ఎందుకు స్పందించడం లేదని ఎస్టీయు రాష్ట్ర నాయకులు గంటామోహన్, జిల్లా నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై స్పందించని ఎడల ఈ నెల 28వ తేదీ డిఇఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

## నిమ్మ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

**కెవికె అధిపతి డాక్టర్ బిజి రాజులు**



వెంకటగిరి, జులై 16, ప్రభాతవార్త : నిమ్మ సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆత్మ నెల్లూరు వారి సౌజన్యంతో డా. బి. గోవిందరాజులు అధ్యక్షతన నిమ్మ సాగుపై రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మలు వేరు కుళ్ళు తెగులు గజ్జి, ఆకు మడత తెగలు, వంటివి ఎక్కువగా ఆశిస్తూ ఉంటాయని వీటికి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడాలని చెప్పారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. దొరసాని ఆత్మ ప్రాజెక్టు ద్వారా అనేక కార్యక్రమాలు రైతుల కోసం చేపడుతున్నట్లు తెలిపారు. నిమ్మ సాగులో రైతుల కోసం చేపడుతున్నట్లు తెలిపారు. నిమ్మ సాగులో రైతులు నానో యూరియా, నానో డిఏపి ఎరువులను వాడుకోవాలని సూచించారు. ఆత్మ డిపిడి మాట్లాడుతూ నిమ్మలో వేరుకుళ్ళు తెగులు నివారణకై ట్రికోడర్మ విరిడీ అనే జీవ సిలేంద్ర నాశినిని ఉపయోగించాలని కోరారు. గ్రామీణ యువతకు ఇస్తున్న వృత్తి, శిక్షణ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఏడిఏ డా. ఎం. నాగార్జున సాగర్ మాట్లాడుతూ నిమ్మ ధర తక్కువగా ఉన్నప్పుడు రైతులు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలని కోరారు. నిమ్మ పరిశోధన కేంద్రం అధిపతి డా. సి. మధుమతి నిమ్మ సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని యాజమాన్య పద్ధతులైన పూత నియంత్రణ, ఎరువుల యాజమాన్యం, అంతర పంటలు గురించి వివరించారు. ఇఫ్కో మేనేజర్ లక్ష్మి నారాయణ యూరియా, నానో డిఎపి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డా. నాగార్జున రెడ్డి, డా. రాజీవన, డా. విజయ శ్రీ, వెంకటగిరి, దక్కిలి, బాలాయపల్లి, నాయుడుపేట, రాపూర్ మండలాల రైతులు పాల్గొనడం జరిగింది.

## పుట్టాలమ్మ ఉత్సవంకు ముమ్మరంగా ఏర్పాట్లు



కోట,జులై 16 ప్రభాతవార్త : కోట మండలం చెందోడు గ్రామంలోని చల్లాళ్ల మరికొంత మంది ఇంటి దైవం వడ్డి పాళెం ప్రజలు ఇలవేల్పు పుట్టాలమ్మ ఉత్సవాలకు సిద్ధమైంది.ప్రసిద్ధి గాంచిన ఆషాడ మాసంలో ఐదు రోజుల పాటు భక్తుల ఉత్సవాలకు తరలి వస్తారు.దీంతో చెందోడులోని యువత ముందుకు వచ్చి. రోడ్లను శుభ్రం చేయించారు.ఆలయం నూతన రంగులలో విద్యుత్ కాంతులతో ముస్తాబువుతోంది. ఈనెల 19 నుంచి 23 వరకు పుట్టాలమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ ఉత్సవాలను తిలకచేందుకు భక్తులు,బంధు మిత్రులు, స్నెహితలు విద్యానగర్‌కు చేరుకొంటున్నారు.రోడ్డుకి ఇరువైపుల విద్యుత్ ఆలకరణలు చేస్తున్నారు. చెందోడు గ్రామంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు గ్రామదేవత శ్రీపుట్టాలమ్మ గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు పుట్టాలమ్మ ఆలయ భక్తబృందం తెలిపింది. 19న ఉదయం 9 నుంచి 10 గంటలలోపు అమ్మవారికి అభిషేకం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల్లోగా పుట్టబంగారం తీసుకురావడం, 20న అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నప్రసాదం, 3 గంటలకు వెంకటేశ్వరస్వామి కలశం, బాణాసంచా వేడుకలతో వివిధ పుష్పాలంకరణలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించడం, 21న అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు ఆలయంలోకి పుట్టబంగారం తీసుకురావడం, రాత్రి 9 గంటలకు అమ్మవారి కథ ప్రస్థానం, 22న అమ్మవారికి పంచామృతాభిషేకం, తప్పెట్లు మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో అమ్మవారి గ్రామోత్సవం, 23న గ్రామంలో పొంగళ్లు వంటి కార్యక్రమాలు ఉంటాయని కమిటీ తెలిపింది

## విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం

**గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్**



గూడూరు, జులై 16 ప్రభాతవార్త : గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులందరికీ ఆరోగ్య పరిస్థితి బాగుందని వైద్యులు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారని గూడూరు ఆర్డివో కిరణ్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థులను గూడూరు ఆర్డిఓ కిరణ్ కుమార్ పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో పిల్లల ఆరోగ్య పరిస్థితి పై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కలుషితమైన ఆహారం తినడంతో పిల్లలు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని 30 మంది విద్యార్థులకు గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం చిన్నారుల పరస్థితి బాగుందని ఇద్దరిని నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కి పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారని శానిటేషన్ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ఆర్డిఓ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్ షరన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం బాటిల్స్ ధ్వంసం



వాకాడు, జులై 16 ప్రభాతవార్త : స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణంలో మంగళవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవర శ్రీనివాసులు ఆధ్వర్యంలో గూడూరు సెబ్ ఏఈఎస్ రమేష్ బాబు సమక్షంలో అక్రమంగా పట్టుకున్న మద్యం బాటిల్స్ ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గూడూరు సెబ్ ఏఈఎస్ రమేష్ బాబు వాకాడు సెబ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ పరిధిలోని ఉన్నటువంటి ఏరియాలో అక్రమంగా బెల్ట్ షాపులు, నాటు సారాయి, గంజాయి అమ్మిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. సెబ్ పరిధిలోని ఇతర రాష్ట్రాల నుండి మద్యం తెచ్చి అమ్మిన మా దృష్టికి తీసుకురావాలని ప్రజలను ఆయన కోరారు. సెబ్ సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ సెబ్ సర్కిల్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో అక్రమంగా బెల్ట్ షాపులులో నిర్వహిస్తున్న 417 మద్యం బాటిల్స్‌లో పట్టుకొన్ని ప్రభుత్వ నిబంధన ప్రకారం గూడూరు సెబ్ ఏఈఎస్ రమేష్ బాబు సమక్షంలో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ జయరావ్, కానిస్టేబుల్స్ బాలసుబ్రమణ్యం, హరి బాబు, రాజశేఖర్, మునిరాజ్, తదితరులు ఉన్నారు.

## చంద్రగిరి ప్రజల సుధీర్ఘ స్వప్నం : ఎంఎల్ఏ పులివర్తి



చంద్రగరి, జూలై 16 ప్రభాతవార్త: చారిత్రాత్మక చంద్రగిరి పంచాయతీ ప్రజల సుధీర్ఘ స్వప్నం సాకారం చేయడంలో ఎంఎల్ఏ పులివర్తి నాని విశేష కృషి చేస్తున్నారు. చంద్రగిరిలో అంతిమ సంస్కారాలకు అనువైన శ్మశానవాటిక కోసం ప్రజలు ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఎంఎల్ఏగా ప్రమాణం చేసి ఇక్కడ అడుగుపెట్టిన నాటి నుండి గోవిందధామం నిర్మాణానికి ఎంఎల్ఏ తనవంతు కృషి మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు పర్యాయాలు భూ పరిశీలన చేసిన ఆయన మంగళవారం చంద్రగిరిలోని స్వర్ణముఖీనది సమీపంలో గోవిందధామం నిర్మాణానికి అవసరమైన భూమిని మరోమారు సర్వే చేయించి, పనులను చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రజల శ్మశాన వాటిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు గంగపల్లి భాస్కర్, బన్నీ మరణించడంతో వారి అంత్యక్రియలకు హాజరైన తాను ఇక్కడి పరిస్థితికి చలించిపోయినట్లు తెలిపారు. ఆ రోజునే తాను ఇక్కడ గోవిందధామం నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా దశాబ్ద కాలం నుండి ఆర్టీసి అధికారులు చంద్రగిరిలో ఆర్టీసి డిపోకు అనువైన భూమి కొరకు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ తగిన ప్రోత్సాహం లభించకపోవడంతో డిపో ఏర్పాటుకు అవరోధం ఏర్పడింది. ఎళ్ళ వేళలా అందుబాటులో వుంటానని ఎంఎల్ఏ పలుమార్లు ప్రకటించగా, డిపో సమస్య ఆయనకు దృష్టికి వెళ్ళడంతో రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. 5 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆయన ఇక్కడ డిపో ఏర్పాటు చేయడం ద్వారా తిరుపతి కొంత మేరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇందు కోసం నివేధికలను వెంటనే సిద్ధం చేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డాక్టర్ వి.వి.సూర్యసాయి, డిప్యూటీ తహశీల్దార్ అమృత, మండల సర్వేయర్ పురుషోత్తం రెడ్డి, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కొండూరు ప్రవీణ్ రాయల్, హేమాంబరధరరావు, ఏజి పల్లి బాల, సక్కుర్ ధనంజయ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, గౌస్‌భాషా, శానంబట్ల తులసిరెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, కన్నయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గోవిందరాజస్వామి వారి జ్యేష్టాభిషేకం

తిరుపతి హెల్త్, జులై 16 ప్రభాతవార్త : తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న జ్యేష్ఠాభిషేకం మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రతి ఆషాఢ మాసంలో తిరుపతిలోని శ్రీ గోవిందరాజసామి వారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు న్విహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొల్పి కైంకర్యాలు నిర్వహించారు. శతకలశస్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను తిరుచ్చి పై ఆలయ నాలుగు మాడ వీధులో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణరెడ్డి, సూపరింటెండెంట్‌లు నారాయణ, మోహన్ రావు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, ధనంజయులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణకు తగు చర్యలు చేపట్టాలి

**- అనంతపురం సిసిఎఫ్ నాగేశ్వరరావు**



కుప్పం, జూలై 16 ప్రభాతవార్త : కౌండిన్య రాయల్ రిజర్వ్ అభయారణ్యం పరిధిలో వన్యప్రాణుల సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని అనంతపురం జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాగేశ్వరరావు, చిత్తూరు అటవీ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం వీరు రామకుప్పం మండలం ననియాలలో ఉన్న ఎకో-టూరిజం పార్కును పరిశీలించారు. అలాగే శిక్షణ పొందిన ఏనుగులు జయంత్, గణేష్‌ల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అలాగే ఏనుగుల దాడుల నిరోధానికి ప్రభుత్వానికి తగు నివేదికలు పంపుతామన్నారు. అటవీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములు చేయాలని, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి వసతి.. మరుగుదొడ్లపై అధికారుల సర్వే

**- కుప్పం నియోజకవర్గంలో ఇంటింటా లెక్కలు.. వారంలోగా నివేదికలు !!**

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులను కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ప్రజలకు కనీస అవసరాలైన మంచినీరు, మరుగుదొడ్లు ప్రజలందరికీ ఉన్నాయా లేదా అనే అంశంపై సమగ్ర సర్వే చేపట్టాలని కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టేందుకు మండల పరిషత్ అధికారుల నేతృత్వంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సిద్ధమయ్యారు. ఈ సర్వేకు సంబంధించిన ప్రొఫార్మాను సైతం కార్యదర్శులకు అందించారు. కుటుంబంలో ఉన్న సభ్యులు, రేషన్‌కార్డు నెంబరు, మొబైల్ నెంబరు, ప్రజలకు నీటి ట్యాంకుల ద్వారానా లేక బోర్ల ద్వారా లేక నీటి ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నారా లేక నీటి వసతి లేదా అనే అంశంపై సర్వే చేయనున్నారు. ఎ ంత మేర నీటి సరఫరా అవుతుంది అనే లెక్కలు సైతం అధికారులు తీయనున్నారు. ఇక మరుగుదొడ్ల విషయానికి వస్తే మరుగుదొడ్లు ఉన్నాయా వాటిని ప్రజలు వినియోగిస్తున్నారా లేదా అసలు మరుగుదొడ్లు లేవా అనే అంశాలపై సమగ్ర సర్వే చేపట్టనున్నారు. ఈనెల 24వతేదిలోగా గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజల నివాసాలకు గల నీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యంపై వీరు సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించాల్సి ఉంది.

## సప్పరంలో అర్జునుని దివ్యదర్శనం



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం అర్జునుడు సప్పరం వాహనంపై దివ్యదర్శనం ఇచ్చారు.వేసవి కాలంలో నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే ఈ ఏడాది ఉత్సవాలు ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతి రోజూ వర్షాలు కురుస్తుంది. రాత్రి వేళల్లోని ఉత్సవాలు వర్షంలోనే సాగిస్తున్నారు. ఇక్కడి ఆలయంలో నెల నెలా ఒక ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. మంగళవారం అర్జున సమేత ద్రౌపదీదేవి, కృష్ణుడు ఉత్సవర్లను కన్నుల పండువగా ముస్తాబు చేశారు. ఆలయం వద్ద గల అలంకార మండపంలో అలంకార గురుకుల్ చక్కగా ముస్తాబు చేశారు. పట్టణంలోని జయరామారావువీధి, తేరువీధి, బజారువీధి,నగరి వీధి, నెహ్రూ వీధుల గుండా ఊరేగింపు సాగింది. ఉత్సవంతో పాటు దుర్గా ప్రసాద్, ఇన్‌చార్జి లక్ష్మయ్య,మునిరెడ్డి, దామోదరం వారి సిబ్బంది వెంటరాగా ఊరేగింపు సాగింది. పూజాలు రఘు, పురుషోత్తంలు చేపడుతున్న అలంకారాలు భక్తుల్ని ఆకట్టుకుంటున్నాయి.

## సత్వరం సిఎం పర్యటన అర్జీల సమస్యలు పరిష్కారం

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశం**

చిత్తూరు టౌన్, జులై 16 ప్రభాతవార్త: గత నెల 25, 26 తేదీల్లో సిఎం నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా నిర్వహించిన ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారంకు ప్రజల నుండి అందిన రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి మంగళవారం సిఎం నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా ప్రజల నుండి అందిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి ఆర్డీఓలు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 18వ తేదీ నుండి జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను శాఖల వారీగా పంపడం జరిగిందని, ప్రతి శాఖ అధికారి ప్రతి రెండు గంటలకు ఒకసారి తమ మెయిల్స్‌ను పరిశీలించుకోవాలన్నారు. మెయిల్స్‌లో తమకు సంబంధించిన ఫిర్యాదులు వుంటే సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, విఆర్ఓలు ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి ఆర్డీఓలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే సిఎం కుప్పం పర్యటన సందర్భంగా సిఎం సహాయనిధి కోసం అందిన ఫిర్యాదులను పరిష్కరించదగిన వాటిని పరిష్కరించి, పరిష్కరించలేని వాటికి సంబంధించి నివేదికను జెసికి అదించాలని సంబంధిత ఆర్డీఓలను ఆదేశించారు. సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో సంబంధిత అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ ద్వారా పంపించి సంబంధిత నివేదికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు. అలాగే ఎపి మీసేవా ద్వారా అందించే రెవెన్యూ సేవల్లో బియాండ్ ఎస్ఎస్ఎలో కొన్ని మండలాల్లో చాలా ఎక్కువగా వున్నాయని, వాటిని పరిశీలించి సత్వరం తగ్గించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు డిఆర్ఓ బి.పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవానీ, డిఎస్ఓ శంకరన్, డిఎల్‌డిఎ రవికుమార్, సర్వేశాఖ ఎడి గౌస్‌భాష, తదితరులు హాజరయ్యారు.

## ప్రజలకు మంచి వైద్యాన్ని అందించాలి : జిల్లా కలెక్టర్



గంగవరం, జూలై 16, ప్రభాతవార్త:పేద ప్రజలకు మంచి వైద్యం అందించి మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యాధికారి శ్రీనివాసులకు తెలిపారు. మంగళవారం ఉదయం గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోకి వెళ్ళిన వెంటనే అటెండెంట్స్‌ను, మందుల స్టాక్‌ను ఆయన పరిశీలించారు.ఆసుపత్రి లోపల,బయట పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏవైనా సమస్యలు ఉన్నాయని, సకాలంలో మందులు సరఫరా అవుతుందా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాదుల పట్ల ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలి,వాటి నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు తీసుకొవాలన్నారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్న పిల్లల వ్యాక్సినేషన్, ఇమ్యునేషన్ షేడ్యుల్‌ను పాటించాలన్నారు.ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు కాన్పులు చేయబడుతాయని,గత మూడు నెలల్లో 190 డెలివిరీలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.కొన్ని ఆసుపత్రులలో మౌలిక వసతుల కొరత ఉంది రెండు వారాల్లో పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు.ఇటీవల మండలంలోని కలగటూరు పంచాయతీ అరసనపల్లె గ్రామంలో గోపాల్‌రెడ్డి అనే నకిలీ వైద్యుడి వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడని కలెక్టర్‌కు చెప్పగా ఆ విషయం తన దృష్టికి రాలేదని వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో తాహశీల్దారు లోకేశ్వరావు,డిప్యూటి తాహశీల్ధారు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.